విశాలాంధ్ర కృష్ణా జిల్లా

ఎన్నికలకు సిద్ధమవుతున్న గన్నవరం ఏపీ ఎన్జీవోస్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ గన్నవరం తాలూకా యూనిట్ పదవీకాలం ముగియడంతో తాలూకా యూనిట్ ఎన్నికలు నిర్వహించుటకు సన్నాహాలు మొదలుపెట్టారు. ఈ మేరకు స్థానిక గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవోస్ హోమ్‌లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గన్నవరం తాలూకా యూనిట్ ఎన్నికలు నిర్వహించుటకు ఎన్నికల బృందాన్ని నియమించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.రాజుబాబును ఎన్నికల అధికారిగా, కంకిపాడు తాలూకా యూనిట్ అధ్యక్షుడు యువి.పురుషోత్తమరాజుని సహాయ ఎన్నికల అధికారిగా, జిల్లా సంయుక్త కార్యదర్శి విశ్వనాథంను ఎన్నికల పర్యవేక్షకులుగా నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ తెలిపారు. గన్నవరం తాలూకా యూనిటు ఉద్యోగుల ఓటర్ జాబితాను ఎన్నికల బృందానికి అందజేసినట్లు తెలిపారు. అధికార ఉత్తర్వులను రాజుబాబు, పురుషోత్తమరాజు, విశ్వనాథంకు, అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణ, సతీష్ కుమార్, మధుసూదనరావు, సీవీఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో...
నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

విశాలాంధ్ర-కూచిపూడి : రైతు భరోసా కేంద్రాలలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కేంద్రం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి మాత్రమే రైతుల వద్ద నుండి కొనుగోలు చేయాలని తహసీల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కృష్ణా జిల్లా జేసీ ఆర్ మహేష్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ-క్రాప్‌లో నమోదు చేసుకొని ఈ-కేవైసీ పూర్తయిన రైతులు నుంచి మాత్రమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. మండలంలో గల 16 సచివాలయాలలో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను నాలుగు ఐదు రోజులలో ప్రారంభం చేస్తామని తాసిల్దార్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఏవో కంచర్ల శివప్రసాద్, వీఆర్వోలు, సచివాలయ, ధాన్యం కొనుగోలు కేంద్రాల టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల సేవే బ్యాంక్ లక్ష్యం

విశాలాంధ్ర-పమిడిముక్కల: బ్యాంకు వచ్చే ప్రతి ఖాతాదారునికి మెరుగైన సేవ అందించటమే బ్యాంకు సిబ్బంది లక్ష్యం మని మేనేజర్ ఆర్.రాకేష్ అన్నారు. శుక్రవారం యూనియన్ బ్యాంక్ 104వ ఆవిర్భావం దినోత్సవాన్ని కేక్‌కట్ చేసి నిర్వహించారు. గతంలో ఆంధ్ర బ్యాంకు ద్వారా సేవలు పొందారని ప్రస్తుతం యూనియన్ బ్యాంక్‌లో విలీనమైన తరువాత ఖాతాదారులు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ మేనేజర్ వి.శ్రీకృష్ణ క్యాషియర్ బి.సి.ఆర్.నాయక్, విజయ్ లక్ష్మణ్ జయచంద్ర ఖాతాదారులు వై.నాగేశ్వర రావు వి.కోటేశ్వర రావు టి.వీరయ్య టి.జగదీష్ భారతి పి.నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధిలో ఆజాద్ సేవలు చిరస్మరణీయం: కలెక్టర్

విశాలాంధ్ర-మచిలీపట్నం: దేశ విద్యారంగ అభివృద్ధికి భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమైనవని కలెక్టర్ పి.రంజిత్ బాషా నివాళులర్పించారు. శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 135వ జయంతి వేడుకలు, మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిభ చూపడంలో అల్ప సంఖ్యాక వర్గాలకు మైనార్టీ అనే పదం ఏమాత్రం అడ్డంకి కాదని అందుకు తొలి ఉదాహరణ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అన్నారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ముస్లిలందరిని ఏకతాటిపై నడిపించిన గొప్ప దేశభక్తుడు ఆజాద్ అని కీర్తించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ట్రైనీ కలెక్టర్ చైతన్య, ఎఎస్పీ ఆస్మా పర్వీన్, మార్కెట్‌యార్డ్ మాజీ ఛైర్మన్ షేక్ ముస్తాఫా, జిల్లా వక్ఫ్‌బోర్డు ఇనస్పెక్టర్ ఖాజా మస్తాన, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ అబ్దుల్ రబ్బానీ, చల్లపల్లి ముస్లిం మైనార్టీ నాయకులు ఆయుబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి

విశాలాంధ్ర-గూడూరు: భారతరత్న, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ విద్యా దినోత్సవాన్ని శుక్రవారం గూడూరు మండల ప్రజా పరిషత్ (ఉర్దూ) పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్. అలీ మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి, ఆయన మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు , భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రి, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ విద్యాభివృద్ధికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బచ్చుల. వెంకట రాజారావు, పాఠశాల కో ఆప్షన్ సభ్యులు ఎం డి. బషీర్, ఎం. ఎ. సలీం, మైనార్టీ నాయకులు ఎం.డి సాహెబ్(దాదా), ఉపాధ్యాయురాలు రజియా సుల్తానా, ఉపాధ్యాయుడు అలీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంపై గ్రామ సభలు : ఎండీఓ

విశాలాంధ్ర-పెనమలూరు : మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనుల నిర్వాహణకు రైతుల ఆధ్వర్యంలో గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు ఎండిఓ సునీతా శర్మ తెలిపారు. ఈ నెల 14న గంటలకు గంగూరులో, మధ్యాహ్నం 2 గంటలకు గోశాలలో, 15న ఉదయం 11 గంటలకు పెనమలూరులో, మధ్యాహ్నం 2 గంటలకు పోడవరంలో, 16న ఉదయం 11 గంటలకు వణుకూరులో, 17న ఉదయం 11 గంటలకు పెదపులిపాకలో గ్రామ సభలను జరుగుతాయని తెలిపారు.

పోషకాల లోపంతో మరణాలు రాకూడదు

విశాలాంధ్ర-మచిలీపట్నం: రాష్ట్రంలో ఆహార కొరత, పోషకాల లోపం వల్ల మరణాలు సంభవించకూడదని రాష్ట్ర ఆహార కమీషన్ ఛైర్మన్ సిహెచ్.విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, బందరు మండల పరిధిలో రేషన్‌షాపులు, అంగన్‌వాడీలు, పాఠశాలలు, గురుకుల పాఠశాలను సందర్శించిన ఛైర్మన్ జగనన్న గోరుముద్ద పథకం కింద మధ్యాహ్న భోజనం నాణ్యత, అంగన్‌వాడీలలో గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీ, ప్రజాపంపిణీ వ్యవస్థను పరిశీలించారు. తొలుత నగర పరిధిలోని పాత హౌసింగ్‌బోర్డులో 73వ రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. దుకాణంలో బియ్యం స్టాక్ రికార్డులు తనిఖీ చేసి బియ్యం నిల్వలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ రేషన్‌డీలర్లు అవకతవకలకు పాల్పడితే సహించేది లేదన్నారు. బందరు మండలం పాతేరు గ్రామంలో మరియు స్థానిక దేశాయిపేట-1 చంపా చెరువు అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ చేశారు. హాజరు పట్టీలు పరిశీలించి ఈరోజు ఎంతమంది పిల్లలు హాజరయ్యారు, ఎంతమంది గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు అని ఆరా తీశారు. బియ్యం, పప్పు, నూనె సరుకులు నిల్వలు తనిఖీ చేశారు. దేశాయిపేట కేంద్రంలో ఈనెలతో గడువు ముగిసిన నూనె ప్యాకెట్లను గుర్తించి వాటిని రిటర్న్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం కేజికి రూ.38 ఖర్చు చేసి ఎంతో బలవర్ధకమైన పోలిక్ యాసిడ్ విటమిన్ బి12 వంటి విటమిన్లతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ముఖ్యమంత్రి జగనన్న సరఫరా చేస్తున్నారన్నారు. ఏవైనా సమస్యలుంటే రాష్ట్ర ఆహార కమీషన్ 9490551117 నెంబరుకు మెసేజ్ పెట్టవచ్చన్నారు. తొలుత ఛైర్మన్ జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను కలెక్టర్ బంగ్లాలో కలసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఛైర్మన్ పర్యటనలో డిఎస్‌ఓ పార్వతి, ఐసిడిఎస్ పిడి ఎస్.సువర్ణ, డీఈవో తాహెరా సుల్తానా, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, బిసి సంక్షేమ శాఖ డిడి లక్ష్మీదుర్గ, తహశీల్దార్ సునీల్‌బాబు, ఎంఈవో దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో గోశాల పంచాయతీ నర్సరీ : ఎండిఓ

విశాలాంధ్ర-పెనమలూరు : మండల అవసరాల నిమిత్తం గోశాలలో నర్సరీ ద్వారా మొక్కల పెంపకం చేపట్టినట్లు ఎండిఓ సునీతాశర్మ తెలిపారు. శుక్రవారం నర్సరీని సందర్శించిన ఎండిఓ మాట్లాడుతూ 5వేల మొక్కలను పంపిణీ చేసేందుకు గోశాల గ్రామ పంచాయితీ తరపున ప్రభుత్వం వారి నర్సరీ మొరింగా (మునగ) నర్సరీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ నర్సరీ ఎస్టిమేషన్ కాస్ట్ రూ.28,722 అని తెలిపారు. ఈ సందర్భంగా తీసుకుంటున్న జాగ్రత్తలను ఎండిఓ కు వివరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కానూరు పీవీపీ ఇంజనీరింగ్ విద్యార్థులు

విశాలాంధ్ర-పెనమలూరు : రాష్ట్ర 35వ స్టేట్ యోగా ఛాంపియన్ షిప్ పోటీలకు కానూరు పివిపి సిద్దార్థ ఇంజనీరింగ్ విద్యార్థులు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందని కళాశాల ప్రిన్సిపల్ కె శివాజీ బాబు తెలిపారు. శివాజీబాబు మాట్లాడుతూ ఈ నెల 12, 13 తేదీలలో అనకాపల్లి జిల్లా చోడవరం గ్రామంలో 35 వ స్టేట్ యోగా ఛాంపియన్ షిప్ పోటీలు జరుగుతున్నట్లు తెలియజేశారు. ఈ పోటీలకు యోగా గురువు కెవిఎస్‌కె మూర్తి ఆధ్వర్యంలో తమ కళాశాల బిటెక్ 2 వ యేడాది విద్యార్థులు హుస్సేన్, నిర్మల, చైతన్య లహరి, సాహితి ఎంపికైనట్లు తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించిన ఎంపీపీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : మండలపరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులతో వేసిన రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ తుంగల సుమతి శుక్రవారం పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మండల పరిషత్ 15 ఆర్థిక సంఘం నిధుల 4 వార్డ్ లోని రోడ్డు లక్ష రూపాయలు నిధులతో పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష, తోట గణేష్ పంచాయతీ ఉపాధ్యక్షులు గాజులు జై గోపాల్ ఉన్నారు.

ప్రజాసేవల వ్యవస్థ పనితీరులో ఏపీ ముందంజ : మంత్రి జోగి

విశాలాంధ్ర-బంటుమిల్లి : ప్రజాసేవల వ్యవస్థ పనితీరులో సీఎం జగన్ సంక్షేమ పాలనలో గడప గడపలో ఆనందం వెల్లివిరిస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా శుక్రవారం మంత్రి జోగి రమేష్ ముంజులూరులో పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటి గడపను సందర్శించి వారి సమస్యలు, ప్రభుత్వం అందజేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి క్షున్నంగా అడిగి తెలుసుకుని వారు సంతోషంగా చేప్పే సమాధానానికి మంత్రి జోగి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలివెల చినబాబు, జడ్పీటిసి మలిశెట్టి వెంకట రమణ, ఒడిమె చిన్నరిబాబు, మట్ట నాగబాబు, రాష్ట్ర అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టరు తిరుమాని శ్రీనివాసరావు, ముంజులూరు సర్పంచి కూనపరెడ్డి సునీత, ఎంపిటిసి కూనపరెడ్డి విజయలక్ష్మి, కంచడం సర్పంచి బండారు చంద్రశేఖర్, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు మలిశెట్టి రాజబాబు, మల్లేశ్వరం మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు పాలడుగుల బాబురావు, కొప్పర్తి సుబ్బారావు, ఎంపిడిఓ జె స్వర్ణబారతి, తహశీల్దారు పాల్గొన్నారు.

గుడివాడలో..

స్థానిక 7వ వార్డులో 2వ రోజు నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అధికార యంత్రాంగంతో కలిసి శుక్రవారం ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి వచ్చిన పలు సమస్యల పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరంలో..

వైసిపి ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వాన్ని గన్నవరం ఎమ్మెల్యే డా వల్లభనేని వంశీమోహన్ అన్నారు. శుక్రవారం నిడమనూరు రాంనగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయం ఏర్పాటు చేసి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్ అన్నారు. రాంనగర్లో డ్రైనేజీకి నిర్మానానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శీలం రంగారావు, కొమ్మ కోట్లు, ఉంగుటూరు మండల వైసిపి అధ్యక్షులు వింత శంకర్‌రెడ్డి, పరిమి కృష్ణ సమ్మెట సాంబశివరావు, జడ్పీటిసి ఎలిజబెత్ రాణి, గన్నవరం సర్పంచి నిడమర్తి సౌజన్య, నాగేశ్వరరావు, అన్నవరపు నాగేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పమిడిముక్కలలో...

మంటాడలో గడప గడపకు కార్యక్రమం జరిగింది. తమకు నివేశస్థలాలు కాలంటూ మహిళలు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌ని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కైలే ప్రభుత్వం అనుమతితో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని దీనికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నందమూడి వీరమ్మ యంపిటిసి మేరుగ లక్ష్మి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-గుడివాడ : ఈ నెల 14 నుండి 20వ తేదీ వరకు నిర్వహించే 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెకంటేశ్వరరావు(నాని) అన్నారు. శుక్రవారం స్థానిక రాజేంద్రనగర్‌లో కొడాలి స్వగృహంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల బ్రోచర్‌ను కొడాలి నాని ప్రారంభించారు. ఈ కార్యక్రంలో మున్సిపల్ కమిషనర్ పి.జె సంపత్‌కుమార్, గ్రంథాలయ అధికారిణీ కె.రామదేవి, సభ్యులు డి.ఆర్.బి ప్రసాద్ పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-కూచిపూడి : కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. మొవ్వ మండలంలోని మొవ్వ, పెదసనగల్లు, పెదముత్తేవి, కోసూరు, కాజలలో తృతీయ శ్రేణి శాఖా గ్రంథాలయాలలో ఈ వేడుకలు నిర్వహించడానికి ఆయా గ్రంథాలయ పాలకులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతిరోజు ఎలిమెంటరీ, హై స్కూల్, కళాశాలల విద్యార్థిని విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు కృష్ణకుమారి పేర్కొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 150 మందికి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవినీ వైద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విజయవాడకు చెందిన సిద్ధార్థ మెడికల్ కాలేజీ ఈ కార్యక్రమంలో పాల్గొని పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు, చర్మ వ్యాధి నిపుణులు, ఆర్థోపెటిక్ నిపుణులు పరీక్షలు నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు బీహెచ్ వి ఎస్ ఆర్ సాయి, పాగోలు రమేష్ బాబు, కోశాధికారి కోనేరు మంజునాథ్ లతోపాటు సభ్యులు పాల్గొన్నారు, ఈ పరీక్షలలో ఎక్సరేఖర్చులు పదివేల రూపాయలను అధ్యక్షులు సాయి స్పాన్సర్ చేశారు.

यूनियन बैंक యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అవనిగడ్డ బ్రాంచి : డోర్ నెం. 5-249, గాలిగోపురం దగ్గర, మెయిన్ రోడ్డు, అవనిగడ్డ గ్రామం, కృష్ణా జిల్లా, ఎపి-521121

డిమాండ్ నోటీసు

టు : ఋణగ్రహీత : శ్రీమతి లంకే సీతామహాలక్ష్మి, భర్త : లేటు బాలకృష్ణ, డి.నెం. 5-196, అవనిగడ్డ, కృష్ణా జిల్లా, ఎపి - 521121

నేచర్ ఆఫ్ లిమిట్	అమౌంట్ (రూ. లక్షల్లో)	బకాయి మొత్తము (రూ.) ది. 28-09-2022
HOUSING LOAN 228830100013339	రూ. 3,50,000/-	Rs. 2,02,175.89

ప్రాథమిక హామీ : కృష్ణా జిల్లా, అవనిగడ్డ మండలం, అవనిగడ్డ గ్రామం, డోర్ నెం. 5-202, ఆర్.ఎస్.నెం. 272-1ఎ వద్ద 263.67 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఇంటి స్థలము అందలి ఆర్.సి.సి. బిల్డింగ్ (గ్రౌండ్ + 1 అంతస్తు)కి హద్దులు : తూర్పు : బండి మధుసూధనరావు గారి స్థలము, దక్షిణం : పంచాయితీ రోడ్డు, పడమర : గోర్తి గౌరిశంకర్ గారి బిల్డింగ్, ఉత్తరం : పంచాయితీ రోడ్డు.

అమ్మా / అయ్యా,

విషయం : ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము ప్రకారము నోటీసు - మీరు మా నుండి పొందిన ఋణ సౌకర్యములకు సంబంధించి - నిరర్థక ఆస్తులుగా వర్గీకరణ.

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మీరు హోమ్ లోన్ క్రింద మా అవనిగడ్డ బ్రాంచి వద్దనున్న మీ ఋణ బకాయిలను / వడ్డీని చెల్లించుటలో విఫలమైనందున మీ ఖాతాను ది. 28-09-2022న నిరర్థక ఆస్తిగా (NPA) వర్గీకరించబడింది. ఎగువ తెలిపిన తేదిన మీ ఋణ ఖాతాల బకాయిలు మొత్తము పైన తెలుపబడినవి. అనేక మార్లు విన్నపములు చేసినప్పటికీ, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు / మీ ఋణములను చెల్లించలేదు. అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 యొక్క సెక్షన్ 13 (2) ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణ పత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పందపు రేటు ప్రకారము పైన తెలుపబడిన బకాయి తేది తదుపరి నెలవారి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంకుకు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏదేని లేద అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

1) మీరు సదరు బకాయిలను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంకు వారు సదరు చట్టం ప్రకారం వారికి సంక్రమించిన అన్ని హక్కులను వినియోగించి హామీ ఇవ్వబడిన ఆస్తుల విక్రయ ధనముతో బకాయిలను పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయి సొమ్ము మీ నుండి రాబట్టుకొనుటకు, న్యాయస్థానము / డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ నందు తగు న్యాయపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.

2) సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (13) ప్రకారము ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా విక్రయించరాదు. మరియు లావాదేవీలు జరుపరాదు సదరు సెక్షన్‌లో నిబంధనలలో ఏ విధమైన అతిక్రమణ జరిగిన తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.

SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

తేది : 30-09-2022 సం/- అథరైజ్డ్ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

జగనన్న ఇల్లు, పేదలందరికీ కన్నీళ్లు

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ : జనసేన ఆధ్వర్యంలో జగనన్న కాలనీ, టిడ్కో ఇళ్లను పరిశీలన చేశారని, మచిలీపట్నం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు జరిగిన ఇళ్ల పంపిణీ విధానంలో జరిగిన అన్యాయాన్ని ప్రతికటించాలని ఆయన అన్నారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ఈ నెల 12, 13, 14 తేదీల్లో 'జగనన్న ఇళ్లు - పేదలందరికీ కన్నీళ్లు' జనసేన సామాజిక పరిశీలన కార్యక్రమాన్ని అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. జగనన్న కాలనీల్లో జరిగిన అవినీతినీ భయట పెట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా జనసేన ఆధ్వర్యంలో ఈ వినూత్న నిరసన చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. జనసేన పార్టీ నగర కార్యదర్శి గడ్డం రాజు మాట్లాడుతూ బందరు శివారు ప్రాంతాలలో లోతట్టు ప్రాంతాలలో తక్కువ పంట పొలాలను ఎక్కువ ధర చెల్లించి పేదలకు సెంట్ భూమి ఇవ్వడం చాలా అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో వంపు గడవల చౌదరి జనసేన నాయకులు వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి రూ.20 వేలు విరాళం

విశాలాంధ్ర-పమిడిముక్కల: అమీనపురంలో నిర్మిస్తున్న శివాలయానికి రోటరీ క్లబ్ ఉయ్యూరు వారు రూ.20 వేలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో కె.సి.పి. జి.ఎం. వి.వి.పున్నారావు, రోటరీ అధ్యక్షులు సిహెచ్.టి. వెంకటేశ్వరరావు, డీజీఎం ఆర్.సూర్యారావు, ఎ.జి.యం. ఆర్.ఎస్. రామచంద్ర రావు కే.సి.పి. సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం

విశాలాంధ్ర-పమిడిముక్కల: మండలంలోని రైతులు తమ ధాన్యం రైతు భరోసా కేంద్రాల్లో అమ్ముకోవడానికి అన్ని ఏర్పాట్లు చేశామని తహశీల్దార్ డి. రాజ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం రెవిన్యూ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 15 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయుటకు ఏర్పాట్లు చెశామని ఎవ్వరికైనా సందేహాలు వుంటే విఎఎ, విఆర్ఓ లను గాని లేదా మండల వ్యవసాయాధికారిని గాని సంప్రదించాలని ఆమే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. శివరామ్, విఆర్ఓ లు సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదు: ఎస్ఐ

విశాలాంధ్ర-పెదపారుపూడి : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై నాగ కళ్యాణి అన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడి నాలుగు రోడ్ల కూడలిలో వాహనాలు తనిఖీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రతి ఒక్కరు లైసెన్స్ తప్పనిసరిగా పొంది ఉండాలని, అదే విధంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనాలపై ఇద్దరమించి ప్రయాణం చేయరాదని, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, తదితర అంశాలపై వాహనదారులను హెచ్చరించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారులపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

రంగయ్య-రాములమ్మ జ్ఞాపకార్థం అన్నదానం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారి ప్రాంగాణంలో శుక్రవారం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. బోధానందస్వామి ట్రస్టు ఎన్‌టీఆర్ జిల్లా. నందిగామ మండలం అంబారుపేట సద్గురు బోధానందస్వామి గీతా ప్రచారసమితి వారు గజ్జి. రంగయ్య-రాములమ్మ జ్ఞాపకార్థం అన్నదానం నిర్వహించామని, కుమారుడు గజ్జి. రామూర్తి. ప్రమీల దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి ప్రసాద్, అశ్విని రవికుమార్, విజయలక్ష్మి, పల్ల బోతుల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

భారతరత్నకు ఘంటసాల పేరు సూచించాలి

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : గాన గంధర్వుడు, శతాబ్ది గాయకుడు ఘంటసాల శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని భారత ప్రభుత్వం ప్రకటించే భారతరత్న పురస్కారానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఘంటసాల పేరును సూచించాలని ఘంటసాల కోడలు ఘంటసాల కృష్ణకుమారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక శాఖామాత్యులు కిషన్ రెడ్డికి,ఆంధ్రప్రదేశ్ పర్యాటక సాంస్కృతిక శాఖామాత్యులు రోజాకు వినతి పత్రాలను సమర్పించానని తెలిపారు. గాంధీనగరం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం సాయంత్రం కళాకారులతో జరిగిన సమావేశంలో ఘంటసాల కోడలు కృష్ణకుమారి మాట్లాడుతూ ఘంటసాల జయంతి,వర్ధంతి ఉత్సవాలు రెండు తెలుగు రాష్ట్రాలలో ఘనంగా జరుగుతున్నాయని,అభిమానులకు ఘంటసాల కుటుంబం రుణపడి ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 4వ తేదీ శత జయంతి ఉత్సవం ప్రారంభం అవుతుందని 100 కేంద్రాలలో సంగీత విభావరులను నిర్వహించి ఘంటసాలకు నివాళులర్పించాలని, భర్త ఆశయం మామ ఘంటసాల వారిపై ఉన్న భక్తితో ఈ బాధ్యత తన భుజాలపై వేసుకున్నానని తెలిపారు. 2003 లో భారత ప్రభుత్వం పోస్టల్ స్టాంప్ ని కూడా విడుదల చేసిందని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధులు అని కూడా తెలిపారు. వేదికపై వెన్నెలకంటి ప్రమీల, చిట్టిబాబు, కెవి రెడ్డి,కె ఆదిశేషు, చల్లా సుబ్బారా యుడు, రమణ, బాబ్జి, శ్రీనివాసరావు, ఘంటసాల సుబ్రహ్మణ్య ప్రసాద్,ఘంటసాల రమా కామేశ్వరరావు, శ్రీనివాసరావు, జిలాని ఖాన్ తదితరులు పాల్గొన్న కార్యక్రమంలో చల్లా సుబ్బారాయుడు రూపకల్పన చేసిన శతాబ్ది గాయకుడు ఘంటసాల పుస్తకాన్ని ఘంటసాల కోడలు కృష్ణకుమారి ఆవిష్కరించారు. సంగీత సాహిత్యాల మాధుర్యం ఘంటసాల పాటల గానం. శతాబ్ది గాయకుడు ఘంటసాల శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని హనుమంతరాయ గ్రంథాలయం గ్రంథాలయం హాలులో జరిగిన సినీ సంగీత విభావరి శ్రోతలకు సంగీత సాహిత్యాల మాధుర్యాన్ని పంచుతూ సాగింది. మద్దెల శ్యాంప్రసాద్, డేవిడ్ రాజు, ఉమాశంకర్, శివశర్మ,రాజేష్, దానియల్,సయ్యద్ అలీ,సత్య స్వాతి, పావని, లక్ష్మీతులసి తదితరులు నీ కొండకు నీవే రప్పించుకో,ఘనా ఘన సుందర,స్వాతంత్రమే నా జన్మ హక్కని, నన్ను దోచుకుందువటే,ఏమో ఏమో ఇది, ఓ నాన్న నీ మనసే వెన్న,అమ్మ అని పిలిచిన ఆలకించ వేమమ్మ వంటి ఇత్యాది పాటలను రసరమ్యంగా పాడి వినిపించారు.

ఘనంగా మౌలాలా అబుల్ కలాం ఆజాద్ జయంతి

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయంలో శుక్రవారం దివంగత మాజీ కేంద్ర విద్యా మంత్రి మౌలాలా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయితీ కార్యనిర్వహణాధికారి ఎ.జె.ఎల్.నరశింహారావు కార్యలయ సిబ్బంది అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తొలి కేంద్ర మంత్రిగా ఆయన అందించిన సేవలను కార్యనిర్వహణాధికారి కొనియాడారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీల విస్తరణాధికారి వి.దిలీప్ కుమార్ కూడా మాజీ కేంద్ర విద్యా మంత్రి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యలయ సిబ్బంది ఎన్.ఎలిజబెత్ రాణి, ఎన్.రవితేజ, జి.పీటర్, దావూద్ బేగ్, కృష్ణ, రంగారావు, విద్యాశాఖ కార్యలయ సిబ్బంది పాల్గొన్నారు.

అతావుల్లా బాబా దర్బార్‌ను దర్శించుకున్న కృష్ణారెడ్డి

విశాలాంధ్ర-ఎ.కొండూరు : విజయనగరంలోని ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం బాబా మెట్టలో వేంచేసి ఉన్న సూఫీ షహెన్షా సద్గురు హజరత్ బాబా ఖాదర్ వలీ ప్రియ శిష్యులు అలుపెరుగని అన్నదాత, ఆధ్యాత్మిక శిఖరం, సూఫీ సూరీడు, మహా మానవీయులు హజరత్ ముహమ్మద్ అతావుల్లా షరీషా తాజ్ ఖాదరీ బాబా వారి మొట్టమొదటి సుగంధ మహోత్సవ ముగింపు కార్యక్రమానికి గురువారం రాత్రి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, బాబా తనయులు, బాబే బొగ్దాద్ ఏ ఏ ఎం టి కే దర్బార్ రెండొవ పీఠాధిపతి సజ్జదా నషీన్ పీర్ జాదా ముహమ్మద్ ఖాజా మొహిద్దీన్, విజయనగరం ఖాదర్ బాబా దర్బార్ దర్గా ముతవల్లి డాక్టర్ ఎండి. ఖలీలుల్లా షరీఫ్, ప్రముఖ వాస్తు శిల్పి గులాం జాఫర్ షరీఫ్, తాజ్ ఖాదర్ బాబు, కుమార్తె బొగ్దాది లతో కలిసి బాబా దర్బార్ ను సందర్శించి పూలు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఘనంగా నివాళులర్పించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ బాబా స్వర్గారోహణ చెందటం సూఫీ ఇజానికి, భక్త బృందానికి తీరని లోటన్నారు. మహనీయులకు చిరస్మరణీయం తప్పా మరణం ఉండదన్నారు. బాబాతనయులు కూడా వారి అడుగుజాడల్లో నడుచుకుంటూ వారి ఆశయాలను కొనసాగిస్తూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించటం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం బాబా తనయులు కృష్ణారెడ్డిని శాలువతో ఘనంగా సన్మానించారు. సజ్జదా నషీన్ పీర్ జాదా ముహమ్మద్ ఖాజా మొహిద్దీన్ మాట్లాడుతూ బాబా ఆశయాలను కొనసాగిస్తూ ఏఏ ఎంటికె దర్బార్ లంగర్ షరీఫ్‌లో నిత్యన్నసమారాధన కొనసాగించడమే తమ కర్తవ్యం అన్నారు. బాబా అభీష్టం మేరకు వారి భక్తులందరినీ ఏకం చేయడం, బాబా విశ్రాంత మందిరాన్ని నిర్మించటం, బాబా భక్తి ప్రపత్తులతో ప్రారంభించిన ప్రతి కార్యక్రమాన్ని మరింత నిర్మాణాత్మకంగా ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో బాబా తనయులు విజయనగరం ఖాదర్ బాబా దర్గా షరీఫ్ ముతవల్లి డాక్టర్ ఎండి. ఖలీలుల్లాషరీఫ్, తాజ్ ఖాదర్ బాబు, కుమార్తె బొ గ్దాది, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఎండి ఖాజామొహిద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి. అసుదుల్లా, న్యాయంపల్లి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయానికి మించి ఆస్తులు ఉన్న
తహసీల్దార్ బద్రునాయక్‌పై కేసు నమోదు

తమ్ముడు చంటి, బావమరుదుల ఇళ్లల్లో సోదాలు.. రూ.30 లక్షల విలువైన డాక్యుమెంట్లు స్వాధీనం

మాట్లాడుతున్న ఏసీబీ సిఐ నాగరాజు

కుదపతండాలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

విశాలాంధ్ర-ఎ.కొండూరు/రెడ్డిగూడెం : కృష్ణా జిల్లా పెనమలూరు మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎ.కొండూరు మండలం కుమ్మరి తండా గ్రామానికి చెందిన గుగులోతు బద్రునాయక్ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నాడనే ఆరోపణలతో శుక్రవారం విజయవాడ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సిఐ బి.నాగరాజు ఆధ్వర్యంలో ఏసీబీ కానిస్టేబుల్ దుంగం శ్రీనివాసరావు, డీఎస్ నాగేశ్వరమ్మ ముందుగా పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో, తహసీల్దార్ బద్రునాయక్ ఇంట్లో ఇంకా 7 చోట్ల ఏకకాలంలో దాడులు చేసి, విలువైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎ.కొండూరు మండలం కుమ్మరి కుంట్లతండా గ్రామంలో బద్రునాయక్ తమ్ముడు గుగులోతు చంటి ఇంట్లో కూడా సోదాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏసీబీ సిఐ నాగరాజు మాట్లాడుతూ పెనమలూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న గుగులోతు బద్రునాయక్ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని ఆరోపణలు రావటంతో విజయవాడ ఏసీబీ రేంజ్ పరిధిలో ఒక కేసు రిజిస్టర్ అయినట్టు తెలిపారు. అవినీతి నిరోధక శాఖ కోర్టు నుంచి సెర్చ్ వారెంట్ తీసుకొని కుమ్మరి కుంట తండా గ్రామంలో తమ్ముడు చంటి ఇంట్లో సోదాలు నిర్వహించగా బద్రునాయక్ భార్య, తల్లి కుమార్తె పేర్ల మీద ఉన్న అతి ముఖ్యమైన విలువైన ఒరిజినల్ డాక్యుమెంట్లు దొరికాయని, వీటి విలువ రూ.30 లక్షలు వరకు ఉంటుందని వీటిని సీజ్ చేసినట్టు తెలిపారు. చంటి ఇంట్లో నగదు కానీ బంగారం కానీ దొరకలేదని తెలిపారు. తహసీల్దార్ బద్రునాయక్‌పై కేసునమోదు చేసి ఏసీబీ కోర్టులో హాజరు పరిచనున్నట్లు సిఐ నాగరాజు తెలిపారు.

కుదపతండాలో బద్రునాయక్ బావమరుదుల ఇళ్ళలో సోదాలు

రెడ్డిగూడెం మండలం కుదప తండాలో బద్రునాయక్ బావమరుదుల ఇళ్ళలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు రవిబాబు మాట్లాడుతూ బద్రునాయక్ బంధువులు, స్నేహితులు నివాసాల్లో ఏకకాలంలో 9 చోట్ల 6 గంటలపాటు సోదాలు చేశామన్నారు. దీనిలో భాగంగా కుదప తండా బద్రునాయక్ ఇద్దరు బావమరుదులు ఇళ్ళలో కూడా సోదాలు చేసి, రికార్డులు ఆస్తుల వివరాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు సీహెచ్ రవిబాబు, వి. సురేష్‌బాబు, ఏసీబీ సిబ్బంది, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజలను మోసం చేసిన మోడీ..గో...బ్యాక్

సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర-ఏ కొండూరు : సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రసమితి పిలుపులో భాగంగా శుక్రవారం ఏ కొండూరు మండల కమిటీ ఆధ్వర్యంలో. ఇబ్రహీంపట్నం.టు. జగదల్ పూర్ జాతీయ రహదారి (ఎన్ హెచ్ 30) మండలంలోని చీమలపాడు మెయిన్ సెంటర్‌లో అమరవీరుల స్మారక స్తూపం వద్ద సీపీఐ శ్రేణులు రాష్ట్రానికి అన్యాయం చేసిన నరేంద్ర మోడీ గొ.బ్యాక్... ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ... విభజన హామీలు అమలు చేయాలనీ సీపీఐ జిందాబాద్ అంటూ పెద్దఎత్తున నిరసన తెలిపారు. ఈ నిరసనలో ముఖ్య అతిధిగా సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజిస్తే అందుకు సహకరించిన బీజేపీ ప్రత్యేక హోదా గురించి పార్లమెంట్‌లో చర్చ జరిగే సమయంలో ఆనాటి ఎంపీ వెంకయ్యనాయుడు మాట్లాడుతూ పది సంవత్సరాలు కాదు పదిహేను సంవత్సరాలు ప్రత్యేక హోదా కావాలని డిమాండ్ చేసిన పెద్దమనిషి బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఊసే మరచిపోయిందని కోటేశ్వరరావు బీజేపీ రెండు నాల్కల ధోరణిని తీవ్రంగా దుయ్యబట్టారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వే జోన్, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, విభజన సమయంలో ఇచ్చిన హామీలు నేరవేర్చి, మీరు రాష్ట్రానికి ఇచ్చిన హామీలు అమలు చేసి రాష్ట్రానికి రావాలని ఆయన డిమాండ్ చేశారు. మీరు ఈ రాష్ట్రానికి చేసిన ద్రోహం తెలుగు ప్రజలు ఇంకా మర్చిపోలేదని, ఏ మొహం పెట్టుకొని ఏపీకి వస్తున్నారని, విభజన సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూము కృష్ణయ్య, చిలుకూరి వెంకటేశ్వరరావు, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు దుర్గా కోటేశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కె నాగుల్‌మీరా, మండల కార్యదర్శి మేకల దేవిడ్, నాయకులు ఎస్‌కె కరీముల్లా, చల్లా సర్వేశ్వరరావు, బోడ రాము, భూక్యా తిరపతిరావు, భూక్యా చంటి, ఎం వెంకటేశ్వరరావు, ఎం మోషే, బి శివ.సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పర్యటనపై సీపీఐ నిరసన

విశాలాంధ్ర-జి.కొండూరు : విభజన హామీలను ఏ మాత్రం అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను దగా చేసిన మోదీ నిస్సిగ్గుగా రాష్ట్ర పర్యటన చేయటాన్ని నిరసిస్తూ సీపీఐ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం మైలవరం నియోజకవర్గంలో మండల కేంద్రమైన జి.కొండూరులో సీపీఐ కార్యకర్తలు నిరసనలు తెలిపారు. నల్లజెండాలు, సీపీఐ జెండాలు చేతబట్టి పెద్దపెట్టు నినాదాలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేష్, మహిళా సమాఖ్య జిల్లా నాయకులు సీహెచ్.దుర్గాకోటేశ్వరరావు, మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అన్యాయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు శివయ్య, ప్రసాద్, నాగరాజు, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

గంపలగూడెం గాంధీ సెంటర్లో నిరసన

విశాలాంధ్ర-గంపలగూడెం : భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర పిలుపుమేరకు శుక్రవారం స్థానిక గాంధీ సెంటర్లో భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిలుకూరు వెంకటేశ్వరరావు, తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీలను 8 సంవత్సరాలైనా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నెరవేర్చకపోవడం ఏమిటని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విశాఖ రైల్వే జోన్ ప్రకటనలకే పరిమితమైందని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వటం లేదని దుయ్యబట్టారు. రాజధాని అమరావతిపై స్పష్టత లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి గౌర్రాజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోదీ రాకకు నిరసనగా ప్రదర్శన

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: ప్రధాన మోదీ రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ విస్సన్నపేటలో శుక్రవారం సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఎం.త్యాగరాజు మాట్లాడుతూ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరణ, కోస్తా కారిడార్ అంశాలపై మోదీ స్పష్టమైన ప్రకటన చేయకుండా రాష్ట్రంలో ఎలా పర్యటిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు మండల నాయకులు పితాని నాగేశ్వరరావు, జుజ్జవరపు దానయ్య, మోతే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమంలో అందరూ పాల్గొనాలి

విశాలాంధ్ర-జగ్గయ్యపేట: తెలుగు రాష్ట్రాలకు పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీలను నెరవేర్చని నరేంద్ర మోదీ విశాఖ పర్యటనకు నిరసనగా బంద్ పాటించాలని, నల్లజెండాలతో నిరసన తెలపాలని సీపీఐ పిలుపు మేరకు శనివారం పట్టణంలో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టినట్లు సీపీఐ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యదర్శి పోతుపాక వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో నల్ల జెండాలతో నిరసన చేపట్టనట్లు తెలిపారు. అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

పేదల భాగస్వామ్యంతో అటవీభూములను అభివృద్ధి చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు విజ్ఞప్తి

విశాలాంధ్ర-ఏకొండూరు : జిల్లాలో నిరుపయోగంగా ఉన్న అటవీ బంజరుభూములు, సాగుకు అనుకూలంగా ఉన్న మిగులు భూములను పేదల భాగస్వామ్యంతో అభివృద్ధి చేసి, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. సీపీఐ తిరువూరు ప్రతినిధి బృందంతో కలిసి శుక్రవారం ఏ కొండూరు మండలం కృష్ణారావుపాలెం రెవెన్యూలో ఉన్న 350.సర్వే నంబరులో సుమారు 300 ఎకరాల అటవీ బంజరు భూమిని ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ, నిరుపేదలతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ దారిద్రియ రేఖకు దిగువన ఉన్న పేదలను గుర్తించి వారితో భూములు అభివృద్ధి చేసి, వ్యవసాయానికి తోడ్పాటునందిస్తే, వారి కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకొని, ఆ భూములలో మొక్కలు నాటి తద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చునని ఆయన అన్నారు. ఈ ప్రతినిధి బృందంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూము కృష్ణయ్య, చిలుకూరి వెంకటేశ్వరరావు, ఎస్‌కె నాగుల్‌మీరా, మండల కార్యదర్శి మేకల దేవిడ్, మండల కమిటీ సభ్యులు బొడరాము, భూక్యా శిరోమణి, బి చిలకమ్మ, బి.బుజ్జి, ఎస్ కె కరీముల్లా. సర్వేశ్వరరావు. ఎం. వెంకటేశ్వరరావు. బి తిరుపతిరావు పేదలు పాల్గొన్నారు.

వన్‌టౌన్ సీఐగా సురేష్‌రెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ క్రైమ్: విజయవాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐగా సురేష్‌రెడ్డి శుక్రువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ పటమట పోలీస్ నుండి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతి రాణా బదిలీ చేశారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐగా ఉన్న వెంకటేశ్వర్లును సీఎస్‌బీకు బదిలీ చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారు.

త్వరలో విద్యార్థులకు సెమిస్టర్-2, సెమిస్టర్-3 పాఠ్యపుస్తకాలు

విశాలాంధ్ర-వీరులపాడు: వివిధ పాఠశాల విద్యార్థులకు సెమిస్టర్-2, సెమిస్టర్-3 కి సంబంధించిన పాఠ్య పుస్తకాలు వీరులపాడు మండల ఎంఈఓ ఆఫీసులో అందుబాటులో ఉన్నాయని ఇన్చార్జి ఎంఈఓ ఎల్.నాగరాజు తెలిపారు. మండల ఎంపీపీ కోటేరు లక్ష్మి పాఠ్యపుస్తకాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం అందజేశారు. పాఠ్య పుస్తకాలు ఇచ్చిన తర్వాత విద్యార్థులచే తప్పనిసరి గాబయోమెట్రిక్ వేయించవలనని ప్రధానోపాధ్యాయులను ఎంఈఓ ఆదేశించారు.

చోరీ సొమ్ము స్వాధీనం-బాధితులకు అప్పగింత

విశాలాంధ్ర-జగ్గయ్యపేట: ఇటీవల కాలంలో మండల పరిధిలోని గండ్రాయి గ్రామానికి చెందిన పిల్లి తిరుమల రావు అనే వ్యక్తి స్వగృహంలో 3 లక్షల విలువైన బంగారు నగలను దుండగులు అపహరించారు,కాగా చిల్లకల్లు ఎస్సై చిన్నబాబు ఆధ్వర్యంలో విచారణ చేపట్టి ముద్దాయిని గుర్తించి వారి దగ్గర నుంచి విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకొన్నారు.అనంతరం శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్ జగ్గయ్యపేట నియోజకవర్గ శాసన సభ్యులు సామినేని ఉదయభాను సమక్షంలో బాధితులకు అప్పగించడం జరిగింది.ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో చోరీ చేసిన ముద్దాయిలను గుర్తించి బాధితులకు వారి బంగారాన్ని అప్పగించిన చిల్లకల్లు ఎస్సై చినబాబుని మరియు వారి సిబ్బందిని అభినందించారు. ఆయన ఇటీవల సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకు ప్రభుత్వం ద్వారా పలు అవార్డులు అందుకున్నారని భవిష్యత్తులో ఇంకా ప్రతిభను కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ పల్లెబోయిన యలమందరావు,ఉప సర్పంచ్ రాచకొండ రాజు,పిల్లి శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలు చంద్రబాబును నమ్మరు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ముస్లిం మైనార్టీలను మోసం చేసిన చంద్రబాబు మైనార్టీల ద్రోహి అని ముస్లిం రైట్స్ అండ్ వెల్ఫేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ నూరుద్దీన్ అరోపించారు. శుక్రవారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడిపి ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ముస్లిం మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకొని చిన్న చూపు చూశారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో షేక్ మస్తాన్. షేక్ రఫీ. సయ్యద్ షంషుద్దీన్. ఎండి భాష పాల్గొన్నారు.

మల్లువోలు పీ హెచ్ సీ తనిఖీ

విశాలాంధ్ర-గూడూరు: మండలం మల్లువోలు పీహెచ్‌సీని ఎస్‌హెచ్‌ఎం డిపిఎం ఓ సుదర్శనబాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిహెచ్‌సీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవల అమలు తీరును పరిశీలించారు. వివిధ కార్యక్రమాలకు సంబంధించిన రిజిస్టర్లు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా చూడవలసిన బాధ్యత క్షేత్రస్థాయిలో సిబ్బందిపై ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వి .శివరామకృష్ణ, టీ. మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యాదినోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ : నగరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రం, జర్నలిజం, చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ పాత్రికేయులు ఆజాం మెహబూబ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖామంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని జాతీయ విద్యాదినోత్సవంగా జరుపుకుటుంన్నామని తెలిపారు. స్వాతంత్రోద్యమంలో, విద్యాశాఖ మంత్రి మౌలానా చేసిన సేవలను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మౌలానా అబ్దుల్ కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. ముందుగా మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అర్థశాస్త్ర, జర్నలిజం విభాగాధిపతి ఎన్.జాన్ సుకుమార్, రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ డిఎస్‌విఎల్ బాలసుబ్రహ్మణ్యం, ప్రభుత్వ పాలనా శాస్త్రం విభాగాధిపతి ఎం.పద్మనాభం, చరిత్ర విభాగాధిపతి ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

15న ఆక్యుపంక్చర్‌పై జాతీయ సదస్సు



విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : వరల్డ్ ఆక్యుపంక్చర్ డే సందర్భముగా ఈనెల 15న ఉదయం 10 గం.లకు అశోక్‌నగర్ లోని ఇండియన్ ఓమ్ ' కార్యాలయములో ఆక్యుపంక్చర్ పై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆక్యుపంక్చర్ సైన్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (అస్పా ఇండియా) ప్రధాన కార్యదర్శి డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు.శుక్రవారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనా తర్వాత ప్రజలు సరైన ఆరోగ్య విధానం కొరకు వెతుకుతున్న తరుణంలో ఆక్యుపంక్చర్ సైన్స్ ప్రాధాన్యత సంతరించుకుందన్నారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ ఓ) పరిశోధనలో ఏ దేశంలో అయితే సాంప్రదాయ ఆరోగ్య విధానం బలంగా ఉందో ఆ దేశంలో చావులు తక్కువగా ఉన్నాయని వాటిపై భారతదేశంలో పరిశోధన చేయటానికి గుజరాత్ లోని భావనగర్ వద్ద ఆక్యుపంక్చర్ పై కూడా పరిశోదన జరుపుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా దృష్టి సారించిందని తెలిపారు. కానీ త్వరత గతిన చర్యలు తీసుకోకపోతే విపరీత నష్టం ప్రజలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు.అనాటి సదస్సుకు ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏమ్. టీ. కృష్ణ బాబు ముఖ్య అతిథిగా,ఏ.పీ ఆయుష్ శాఖ కమిషనర్ వి.రాములు,ఆయుష్ డిప్యూటీ కమిషనర్ డా. ప్రసాద్,ప్రభుత్వ ఆయుర్వేద విజయవాడ కాలేజీ ప్రిన్సిపల్ డా.సాయి సుధాకర్ ఇతర అతిధులు విచ్చేయనున్నారన్నారు.ఈ కార్యక్రమంలో రూపా డేనియల్, మౌనిక, పాల్గొన్నారు.

ముదురుతున్న గాలిబ్ షాహీద్ దర్గా కమిటీల వివాదం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ భవానీపురంలోని హజరత్ సయ్యద్ గాలిబ్ షాహీద్ దర్గా కమిటీల వివాదం రోజురోజుకు ముదురుతుంది. నూతన ఏర్పడిన కమిటీ సభ్యులు, ముజువర్ల కుటుంబ సభ్యులు శుక్రువారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ కార్యాలయం వద్ద ఆందోళన చేశాయి. తమకు న్యాయం చేయాలని వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రెండు రోజుల క్రితం ఛైర్మన్ సమక్షంలో రెండు కమిటీల సభ్యులు వాగ్వాదంకు దిగ్గారు. ఆరేళ్లుగా కొనసాగుతున్న కమిటీని రద్దు చేసి ముజవర్లు ఎన్నుకున్న కమిటీ ప్రాతిపాదనను ఛైర్మన్ స్వీకరించడంలేదని ఆరోపించారు. వారికే అనుకూలంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. నూతన కమిటీ సభ్యుడు రహేమాన్ మాట్లాడుతూ దర్గాకు కమిటీ మూడేళ్ల మాత్రమే కొనసాగుతుందని, కానీ పాత కమిటీ ఆరేళ్లుగా కొనసాగుతుందన్నారు. న్యాయ స్థానంలో కొన్ని కేసులు ఉండటంతో ఆదే కమిటీ కొనసాగిందన్నారు. భవానీపురంలోని ముజవర్ల సమావేశం ఏర్పాటు చేసుకుని డైరెక్ట్ మేనేజ్‌మెంట్ కింద కమిటీ ఏర్పాటు చేసుకుని ఛైర్మన్‌కు ప్రతిపాదన ఇచ్చిన స్పందించడం లేదన్నారు. పాత కమిటీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఛైర్మన్ పనిచేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైన ఛైర్మన్ సానుకూలంగా స్పందించి ముజవర్లు ఎన్నుకున్న కమిటీ ప్రతిపాదన నూతన కమిటీని స్వీకరించాలని కోరారు. తమకు న్యాయం జరగపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు చేపడతామన్నారు. అనంతరం ముజవర్లు, కమిటీ సభ్యులు, మహిళలు స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును కలిసేందుకు ఎన్టీఆర్ జిల్లా పార్టీ కార్యాలయంకు తరలి వెళ్లారు.

గంజాయి మత్తులో పైశాచికం!

భవానీపురంలో రౌడీ షీటర్ దారుణ హత్య
హత్యలో పాల్గొన్న పది మంది యువకులు
మూడు రోజులుగా మృతదేహం పక్కనే నిందితుడి నిద్ర

విశాలాంధ్ర-విజయవాడ క్రైమ్: విజయవాడ భవానీపురంలో రౌడీ షీటర్ దారుణహత్యకు గురయ్యాడు. అతని స్నేహితుడే హతమార్చాడు. సుమారు 10 మంది యువకులు పైశాచికంగా హత్యలో పాల్గొన్నారు. ఈ ఘటన భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో కలకలం సృష్టించింది. సేకరించిన వివరాల ప్రకారం కొత్త రాజరాజేశ్వరీపేటకు చెందిన పోకూరి రమేష్(39), గుంటూరు ప్రవీణ్‌లకు భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. వీరిద్దరు స్నేహితులు. అవుట్ ఏజెన్సీ అంబేద్కర్ కాలనీలో ప్రవీణ్‌కు సంబంధించి పాడుబడిన ఇల్లు ఉంది. ఈనెల 8వతేదీన అదే ఇంట్లో యువకులందరూ గంజాయి, మద్యం సేవించారు. మత్తులో ప్రవీణ్ నిద్ర పోతుండగా రమేష్ అసభ్యపదజాలంతో బూతులు తిట్టడంతో ఇద్దరికి మాటమాట పెరిగి గోడవ జరిగింది. డంబుల్ తీసుకుని తలపై దాడి చేశారు. పక్కనే కొంత మంది యువకులు రమేష్‌పై కరెంట్ షాక్, బీరు సీసాలతో మూకుమ్మడి దాడి చేసి హత్య చేశారు. చనిపోయాడని నిర్ధారించుకున్న తరువాత పక్క గదిలోకి మృతదేహాన్ని పెట్టి మరో పక్కగదిలో ఆ రోజుంతా గంజాయి, మద్యం సేవించారు. తరువాత రోజు యువకులంతా వెళ్లిపోయారు. ప్రవీణ్ మాత్రం మృతదేహం ఉన్న పక్క గదిలో మద్యం సేవిస్తూ గడిపాడు. ఇంట్లో నుండి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.ఈ మేరకు ఘటన స్థలానికి వెళ్లి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పక్క గదిలో నిద్రపోతున్న ప్రవీణ్‌తో పాటు కొంత మంది యువకులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. మరి కొంత మంది కోసం పోలీసులు గాలిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చైతన్య విద్యార్థులకు నాసా కిట్ల పంపిణీ

విశాలాంధ్ర-జగ్గయ్యపేట: స్థానిక శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులకు నాసా కిట్లను మునిసిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ ప్రగతి పథం లో నడిపించడమే లక్ష్యంగా గత 9 సంవత్సరాలుగా విలువైన విద్య అందిస్తున్న శ్రీ చైతన్య విద్యా సంస్థలను ఆయన కొనియాడారు. విద్యార్థిని విద్యార్థులను ఇప్పటినుంచే నాసా లాంటి ప్రయోగాత్మక కార్యక్రమాలకు ప్రోత్సహించడం ఎంతో సంతోషంగా ఉందని ఈ కార్యక్రమంలో నన్ను భాగం చేసినందుకు చైతన్య యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏజీఎం మురళీకృష్ణ, వినోద్ కుమార్, ప్రిన్సిపల్ లావణ్య, డీన్ కృష్ణ, నాసా ఇంచార్జ్ నరసింహారావు, కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు,కిషోర్ మరియు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

LOSS OF TITLE DEEDS

I, Kongani Kasamma, W/o. Late K.Venkata Rao # 26-36-150, 2nd line Ankamma Nagar, Guntur Lost Original Sale Deed Belonging to me Doc No: 9748/2013 & 715, 13578/ 1984 SRO Nagarampalem Guntur while Coming to Xerox Shop near court premises, Suryaraopet on 02-11-2022 if found Please Call Cell : 9133976971

KVB Karur Vysya Bank — Smart way to bank

బందరురోడ్డు, విజయవాడ.

బంగారు నగల వేలం ప్రకటన

ఈ దిగువ తెలిపిన నగలను బ్యాంకు వారు బహిరంగ వేలం ద్వారా వేలం వేయ నిర్ణయించినారు కావున తెలియజేయడమైనది.

వేలం జరుగు స్థలము : ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, బందరురోడ్డు బ్రాంచి, డోర్ నెం : 38-8-46, ఎం.జి.రోడ్డు, లబ్బీపేట, కృష్ణాజిల్లా, విజయవాడ-520010. ఫోన్స్ : 0866-2485702, 2487349

నగల తనిఖీ, సమయం : 24/11/2022 మ॥3-00 గం.ల నుండి మ॥ 3-30 గం.ల వరకు

వేలం జరుగు తేదీ, సమయం : 24/11/2022 మ॥ 3-45 గం.లకు.

వ. సం.	ఋణగ్రహీత పేరు & చిరునామా	ఖాతా నెం.	మొ॥ బరువు	నికర బరువు
1)	మహ్మదద్ జాబర్ అహ్మద్, 16-172, వెంకయ్యనగర్ బరా స్కూల్ దగ్గర, గొల్లపూడి, విజయవాడ- 521225	1441802000008220	21.1	20.85
2)	మేడిబోయిన శ్రీనివాసరావు 18-10/2-6/1, ఏడవలైన్, కేదారేశ్వరపేట, విజయవాడ -520003.	1441802000008236	78.5	74.7
3)	కావలకుంట్ల లక్ష్మీదేవి, ఫ్లాట్ నెం : 227, నారాయణపురం కాలనీ, మహాలక్ష్మీ హట్ దగ్గర, పోరంకి , విజయవాడ - 521137	1441802000008443	37.28	37.28
4)	కావలకుంట్ల లక్ష్మీదేవి, ఫ్లాట్ నెం : 227, నారాయణపురం కాలనీ, మహాలక్ష్మీ హట్ దగ్గర, పోరంకి , విజయవాడ - 521137	1441802000008452	52.14	44.5

ముఖ్య నియమ నిబంధనలు :
1) పైన తెలిపిన ఋణ గ్రహీతలకు గతంలో జారీచేసిన నోటీసులకు (అవి ఏ కారణము చేతనైనను తిరిగి వచ్చినను) దీనినే ఆఖరి నోటీసుగా భావించ వలసినది.
2) ఒక వేళ ఋణగ్రహీత మరణించినచో వారి వారసులకు కూడా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
3) ధరావత్తును బ్యాంక్ వారిచే వేలం తేదీ మ॥ 3-30 గం.ల వరకు మాత్రమే స్వీకరించబడును.
4) విజయవంతమైన పాటదారుడు వేలం తేదీ మ॥ 4-00 గం.ల లోగా ధరావత్తు మినహా మిగిలిన పాట మొత్తమును చెల్లించి నగలను స్వంత బాధ్యత వహించి పొందవలెను.
5) నగల నాణ్యతను పాటకు ముందుగానే పాటదారుడు సరి చూసుకోవలెను. అందుకు బ్యాంక్ బాధ్యత వహించజాలదు.
6) ఏ విధమైన ముందస్తు ప్రకటన లేకుండానే వేలంను పాక్షికముగా గానీ పూర్తిగా గాని రద్దు చేయు అధికారము బ్యాంక్‌కు కలదు.
7) పాటదారుడు సరైన ఫొటో మరియు చిరునామా ఋజువులను ప్రాథమికముగా దాఖలు చేయుట తప్పనిసరి.
8) ఇతర పూర్తి నియమ నిబంధనల కొరకు పైన ఉదహరించిన బ్రాంచి నందు సంప్రదించగలరు.
9) అమ్మకపు పన్నును కొనుగోలుదారుడే భరించవలసి ఉంటుంది.

విజయవాడ
11-11-2022

ఇట్లు
ది కరూర్ వైశ్యాబ్యాంక్ లిమిటెడ్., బ్రాంచి మేనేజర్

మైలవరం నియోజకవర్గ రాధా రంగా మిత్ర మండలి అధ్యక్షుడిగా సూర్యకిరణ్

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : రెడ్డికుంట గ్రామానికి చెందిన ఆకుల సూర్య కిరణ్‌ను మైలవరం నియోజకవర్గ రాధా రంగా మిత్ర మండలి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులుగా నియమించారు. చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు ఈ పూర్ణచంద్రరావు(కాళ్ళ పాలెం బుజ్జి) నియామక పత్రాన్ని అందజేసినట్లు సూర్యకిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా సూర్య కిరణ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు రాధారంగామిత్ర మండలి చారిటబుల్ ట్రస్టు తరపున మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తానని తెలిపారు. నాపై నమ్మకంతో నన్ను నియోజకవర్గ అధ్యక్షులుగా నియమించిన కాళ్ళపాలెం బుజ్జికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సూర్య కిరణ్‌ను అభినందించారు.

SWARNA SECURITIES LIMITED
CIN-L52520AP1990PLC011031, 27-1-102, 2nd Floor, Swarnalok Complex, Governorpet,VIJAYAWADA. Andhra Pradesh- 520002. swarnasecurities@rediffmail.com. Ph: 0866-2575928

UNAUDITED FINANCIAL RESULTS FOR THE QUARTER AND HALF YEAR ENDED 30TH SEPTEMBER, 2022

(Rs. In Lakhs)

Sl No.	PARTICULARS	Quarter Ended on		Half Year Ended on		Year Ended on
		30.09.2022	30.09.2021	30.09.2022	30.09.2021	31.03.2022
1	Total Income from Operations	30.99	30.81	60.00	59.77	120.15
2	Net Profit / (Loss) for the period (before tax.Exceptional and/or Extraodinary Items)	22.48	22.97	44.90	39.73	89.10
3	Net Profit / (Loss) for the period before tax.(after Exceptional and/or Extraodinary Items)	22.48	22.97	44.90	39.73	89.10
4	Net Profit / (Loss) for the period after tax.(after Exceptional and/or Extraodinary Items)	18.48	18.97	36.90	31.73	72.10
5	Total Comprehensive Income for the period (Comprising Profit/(Loss) for the Period (after Tax) and Other Comprehensive Incoem (after tax)	18.48	18.97	36.90	31.73	72.10
6	Equity Share Capital	300.00	300.00	300.00	300.00	300.00
7.	Other Equity (excluding revaluation reserves)	0.00	0.00	0.00	0.00	0.00
8.	Earning Per Share (of Rs.10 /- each) (not annualised) Basic: Diluted:	0.62	0.63	1.23	1.06	2.40

Note : 1) The above is an extract of the detailed format of Quarterly Financial Results filed with the Stock Exchange 'under Regulation 33 of the SEBI (Listing and Other Disclosure Requirements) Regulations, 2015. The Full format of the Quarterly Financial Results are available on the Stock Exchange website at www.bseindia.com and company website at www.swarnasecurities.com (2) This financial statement has been prepared in accordance with Indian Accounting Standards (Ind AS), the provisions of the Companies Act, 2013 (the Act), as applicable and guidelines issued by the Securities and Exchange Board of India (SEBI).

Place : Vijayawada
Date : 11-11-2022

By the order of the Board For Swarna Securities Ltd.
Sd/-
MR. MURALI KRISHNA, Managing Director, DIN-01899812

In the Court of the Motor Accidents Claims Tribunal Ananathapuram
(On the file of the Hon'ble District Judge)
O.P No: 144/2022

Between:
1) Akkim Nagaseshu and Another ....Petitioners
And
2) Sujatha Thamballa and 2 others ... Respondents

NOTICE TO RESPONDENT NO : 3
TO,
R3 Ambanti Sreekanth Son of A. Uma Maheswara Rao, Hindu, Major, Driver, R/o 73-5-17, Ramayanapugari Street, Near High School Road, (West) Vijayawada, Krishna District. (Driver of the offending vehicle)

పై దావాలోని 3వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము పై కోర్టు వారు 22-11-2022వ తేదికి వాయిదా వేసినారు. కావునా ఆ దినం ఉదయం 10-30 గంటలకు మీరు స్వయంగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కానీ యెడల పై దావా మీ పరోక్షము నందు తీర్మానించబడును అని తెలియజేయబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
పి. చెన్నారెడ్డి
వాది పరము వకీలు, అనంతపురం
సెల్ నెం: 94400 93880

In the Court of the Motor Accidents Claims Tribunal Ananathapuram
(On the file of the Hon'ble District Judge)
O.P No: 143/2022

Between:
1) Akkim Nagaseshu and Another ....Petitioners
And
2) Sujatha Thamballa and 2 others ... Respondents

NOTICE TO RESPONDENT NO : 3
TO,
R3 Ambanti Sreekanth Son of A. Uma Maheswara Rao, Hindu, Major, Driver, R/o 73-5-17, Ramayanapugari Street, Near High School Road, (West) Vijayawada, Krishna District. (Driver of the offending vehicle)

పై దావాలోని 3వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము పై కోర్టు వారు 22-11-2022వ తేదికి వాయిదా వేసినారు. కావునా ఆ దినం ఉదయం 10-30 గంటలకు మీరు స్వయంగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కానీ యెడల పై దావా మీ పరోక్షము నందు తీర్మానించబడును అని తెలియజేయబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
పి. చెన్నారెడ్డి
వాది పరము వకీలు, అనంతపురం
సెల్ నెం: 94400 93880

విమానాశ్రయంలో ఇల్లు కోల్పోయినవారి

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి

విశాలాంధ్ర-గన్నవరం : విమానాశ్రయం లోఇల్లు కోల్పోయిన వారికి వెంటనే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి అమలు చేయాలని సిపియం జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్ళం వెంకటేశ్వరవు ప్రభుత్వాన్ని డిమెండ్ చేశారు. బుధవారం. దావాజిగుడెంలో సమస్యలు పరిష్కరించాలని నిరెండవ రోజు చేశారు. సీపీఎమ్ నాయకులు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భా గా కె వెంకటేశ్వరవు మాట్లాడుతూవిమానాశ్రయ విస్తరణలో ఇల్లు కోల్పోయినవరకి ప్రభుత్వం ప్రతి ఇంటికి 9 లక్షల రూపాయలు 5 సెంట్లు. భూమి ఇస్తా మని చెప్పి 5 సెంట్లు భూమి ఇచ్చి 9లక్షలు ఇవ్వలేదని ఆరోపించారు. ఇంటి అద్దె చెల్లిస్తామని ఒక సంవత్సరం నుండి అద్దె చెలించటలేదని అన్నారు. ప్రభుత్వం ఇచ్చి భూమిలో మొల్లిక సదుపాయాలు కల్పోయించాలని డిమెండ్ చేశారు. ఏసు రత్నం మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు వచ్చి నా మా సమస్యలు పరిక్షరించటం లేదనివిమర్శించారు. అదికారులు వెంటనే సమస్యలు పరిక్షారించాలని లేని పక్షంలో దీక్ష కొనసాగిస్తామని హెచ్చరించారు.తాడి ప్రతాప్,బేతాల్లా కిరణ్,నిమ్మకూరు కిరణ్, కటూరి విజయ్,సర్పంచి బడుగు బాలమ్మ,సిపియం నాయకులు వై నరసింహారావు,అనుమోలు వెంకటేశ్వరవు, మల్లంపల్లి జయమ్మ, లక్షణస్వామి,మాదిరెడ్డి చిన్న,సాంబశివరావు,తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్‌కు రూ.10వేలు వితరణ

విశాలాంధ్ర - గుడివాడ : రాష్ట్ర బిల్డింగ్& అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ 7వ రాష్ట్ర మహాసభకు తన వంతు సహాయంగా మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నేత చోరగుడి రవికాంత్ సిఐటియు నాయకులకు రూ.10వేల వితరణగా అందజేశారు. గురువారం రాత్రి స్థానిక మున్సిపల్ కార్యలయం వద్ద జరిగిన బహిరంగ సభలో చోరగుడి రవికాంత్ ఈ మేరకు తన విరాళాన్ని యూనియన్ నాయకులకు అందజేశారు.

రేపు యూనియన్ జిల్లా మహాసభ జయప్రదం చేయండి

విశాలాంధ్ర- కంచికచర్ల : ఈ నెల 13 న విజయవాడ సమీపంలోని నున్న గ్రామంలో జరగనున్న ఏపి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఎన్టీఆర్ జిల్లా 8 వ మహాసభ ను జయప్రదం చేయాలని సిఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి యన్ సి హెచ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికుల సమావేశం యూనియన్ జిల్లా అధ్యక్షుడు బెజ్జం భూషణం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3 వేల మందికి పైగా పారిశుద్ధ్య కార్మికులు చాలీచాలని జీతాలతో పని చేస్తున్నారన్నారు. జవో నెంబర్ 551,132 ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు, గుర్తింపు కార్డులు, పీ యస్, ఈ యస్ ఐ, అమలు చేయాల్సి ఉన్నప్పటికీ, పాలకులు మాత్రం అమలు చేయకపోవటం వల్ల కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. టెండర్ విధానం తో పని లేకుండా, ఉద్యోగుల గా కొనసాగించాలని హైకోర్టు తీర్పును సైతం పాలకులు అటకెక్కించి, కార్మికుల చేత వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారన్నారు. గ్రామ పంచాయతీ లలో పనిచేసే స్వేచ్ఛ భారత్ కార్మికులకు నెలకు 10 వేల రూపాయల జీతం చెల్లించాలని ప్రభుత్వ ఉత్తర్వులను గ్రామ పంచాయతీ పాలకులు అమలు చేయటంలేదని ఆరోపించారు. రాజ్యాంగం లోని 73,74 సవరణల ప్రకారం గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించటం లేదన్నారు, పెరుగుతున్న ధరలకనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల కనీస వేతనాలు అమలు చేయటంతో పాటు, ఉద్యోగులుగా గుర్తించాలని, పీ యఫ్, ఈ యస్ ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం, భవిష్యత్తు కార్యాచరణకు ఈ మహాసభలో చర్చిస్తామన్నారు. జిల్లా లోని అన్ని గ్రామ పంచాయతీ లలో పని చేస్తున్న పారిశుద్ధ్య, ఎలక్ట్రికల్, నీటి సరఫరా సిబ్బంది, స్వచ్ఛ భారత్ సిబ్బంది పాల్గొన్న జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి చోడవరపు సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్ ఎయిర్‌ఫోర్స్ ఎక్స్, వై పరీక్షల కోసం ప్రిపరేటరీ కోర్స్ మెటీరియల్ అందిస్తోన్న వియాప్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అగ్నివీర్ వాయు స్కీమ్ కింద ఉద్యోగులను నియమించుకోనున్నామని ఐఏఎఫ్ ప్రకటించిన వేళ వి ఇప్పుడు పరీక్షతో భాగస్వామ్యం చేసుకుని అగ్నివీర్ ఎయిర్‌ఫోర్స్ ఎక్స్, వై గ్రూప్ కోసం వి యాప్‌పై ప్రిపరేషన్ మెటీరియల్ అందిస్తుంది. పరీక్ష వద్ద ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఈ మెటీరియల్‌ను సుప్రసిద్ధ కాడెట్స్ డిఫెన్స్ అకాడమీ సిద్ధం చేశారు. వి యాప్‌పై ఇది ప్రత్యేకంగా లభిస్తుంది. ఐఏఎఫ్ ఉద్యోగ పరీక్షల కోసం వి వినియోగదారులు ప్రిపరేటరీ మెటీరియల్ పొందడంతో పాటుగా అకాడమీకి చెందిన అత్యుత్తమ టీచర్ల చేత ప్రత్యక్ష తరగతులు, మాక్ పరీక్షలు వంటివి అందుబాటులో ఉంటాయి.

దక్షిణ భారతదేశంలో ప్రిస్టిన్ కేర్ విస్తరణ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అగ్రగామి ఆరోగ్య సేవా సంస్థ అందిస్తున్న ప్రిస్టిన్ కేర్ తన విస్తరణకు ప్రణాళిక రూపొందించుకుంది. 2023 చివరికి దక్షిణ భారతదేశంలో 300 ఆసుపత్రులు, 100 క్లినిక్‌లను చేర్చుకోనుంది. ఈ విస్తరణతో తన నెట్‌వర్కులో ఆసుపత్రులను 500కు, క్లినిక్‌లను 150కు పెంచుకోనుంది. ప్రస్తుతం ప్రిస్టిన్ కేర్ శస్త్ర చికిత్స కేంద్రాలు దక్షిణ భారతదేశంలోని ప్రముఖ టైయర్ 1 మరియు టైయర్ 2 నగరాలైన బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, తిరువనంతపురం, కొచ్చి, మధురై, కోయంబత్తూరు, కోజికోడ్, విజయవాడ, విశాఖపట్నాలలో ఉన్నాయి. సాధారణ శస్త్రచికిత్స, ఆప్తమాలజీ, ఇఎన్‌టి, యూరాలజీ, గైనకాలజీ తదితర 12 శస్త్రచికిత్సల విభాగాల్లో కంపెనీ పని చేస్తుండగా, దంత వైద్య విభాగానికి తన సేవలను విస్తరించే ఆలోచనను కలిగి ఉందని ప్రిస్టిన్ కేర్ సహ వ్యవస్థాపకుడు హర్‌సిమర్‌బీర్ సింగ్ తెలిపారు.

కెనరా రోబెకో మిడ్ క్యాప్ ఫండ్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రముఖ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలలో ఒకటైన కెనరా రోబెకో మ్యూచువల్ ఫండ్, ఈక్విటీ, ఈక్విటీ-సంబంధిత సాధనాలలో ప్రధానంగా పెట్టుబడి పెట్టే ఓపెన్-ఎండ్ ఈక్విటీ స్కీమ్ అయిన కెనరా రోబెకో మిడ్ క్యాప్ ఫండ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. మిడ్-క్యాప్ కంపెనీల ఐదేళ్లు, అంతకంటే ఎక్కువ కాల వ్యవధిలో మూలధన ప్రశంసలను ఉత్పత్తి చేసే లక్ష్యంతో. కెనరా రోబెకో మిడ్ క్యాప్ ఫండ్ యొక్క కొత్త ఫండ్ ఆఫర్ ఈనెల 11న తెరవబడి, 25వ తేదీతో ముగుస్తుంది. ఈ సందర్భంగా, సంస్థ ఎండీ, సీఈవో రజనీష్ నరులా మాట్లాడుతూ, "కెనరా రోబెకో మిడ్ క్యాప్ ఫండ్ దీర్ఘకాలంలో సంపదను సృష్టించేందుకు ఆకర్షణీయమైన అవకాశాన్ని అందజేస్తుందని, లంప్సమ్, సిప్ మోడ్ రెండింటి ద్వారా మ్యూచువల్ ఫండ్ పెట్టుబడిదారులు సౌకర్యవంతంగా ఉంటారు. మార్కెట్ అస్థిరతను తొక్కే ఓపికను ప్రదర్శించడం, ఐదేళ్లకు పైగా పెట్టుబడి హెూరిజోన్‌ను ఉంచడం, రిస్క్ సర్దుబాటు చేసిన రాబడుల నుండి ప్రయోజనం పొందవచ్చు" అని పేర్కొన్నారు.

అమ్మకాల్లో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్న స్కోడా ఆటో ఇండియా

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఇండియాను గ్రోత్‌హబ్‌గా గుర్తించిన తర్వాత స్కోడా ఆటో ఇండియా అమ్మకాల్లో సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఈ సాధించిన విజయాలకు గుర్తుగా ఇండియా 2.0 గ్లోబల్ సమ్మేళనాన్ని నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా స్కోడా ఆటోకు మూడో అతిపెద్ద మార్కెట్‌గా భారతదేశం ఆవిర్భవించింది. ఎప్పటికప్పుడు కొత్త ఉత్పత్తులను లాంచ్ చేయడం, నిరంతర విక్రయాల వృద్ధి మరియు వేగవంతమైన నెట్‌వర్క్ విస్తరణతో స్కోడా ఆటో ఇండియా దూసుకుపోతోంది. భారతదేశం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆటోమోటివ్ నిపుణులతో నిర్వహించిన ఈ అతిపెద్ద సమావేశంలో భారతదేశంలోని తయారు చేసిన ఉత్పత్తుల విజయాలను పీక్-టు-పీక్ డ్రైవ్ ప్రదర్శించారు. స్కోడా ఆటో ఇండియా ఇటీవల నిర్వహించిన జీఎన్‌సీఏపీ క్రాష్ పరీక్షలలో కుషాక్ పూర్తి 5-స్టార్ క్రాష్ సేఫ్టీ రేటింగ్‌లను కూడా సాధించినట్లు ఈ సమావేశం ప్రకటించిందని స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పెట్ర్ సోల్క్ తెలిపారు.

అర్హత కలిగిన వారికి సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-గంపలగూడెం : అర్హత కలిగిన వారికి సంక్షేమ పథకాలు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యమని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి అన్నారు. శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆర్లపాడులో ఎమ్మెల్యే రక్షణ నిధి గడపగడపకు తిరిగి ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించారు. జడ్పీటీసి సభ్యులు కోట శ్యాముల్, ఎంపీడీవో ఎర్రమల పిచ్చిరెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు చెరకు నర్సారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : సంస్కరణలకర్త, బహుముఖ ప్రజ్ఞాశీలి, తత్వవేత్త, భారతరత్న మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్‌ను నేటి తరం ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో అబ్దుల్ కలామ్ ఆజాద్ 135వ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలామ్ ఆజాద్ విద్యారంగ అభివృద్ధికి అందించిన సేవలు అజరామరమన్నారు. బహుభాషాకోవిదుడు, గొప్ప రాజకీయవేత్త, విద్యావేత్త స్వాతంత్ర సమరయోధుడు అబ్దుల్ కలామ్ సమాజాన్ని ప్రభావితం చేసి మహోన్నతమైన స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. మౌలానా అంటే పండితుడు అని అర్థమని తెలిపారు. అరబిక్ పెర్షియన్ ఉర్దూ, ఇంగ్లీష్, హిందీ, బెంగాలీ బాషల్లో ఆయన నిష్టతను సాధించారన్నారు. ఆయన విభిన్న భాషలలో నిష్టతను సంపాధించి విద్యావిధానంలో గొప్ప సంస్కరణను తీసుకువచ్చారన్నారు. భారత తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యారంగానికి ఎనలేని కృషి చేశారని మహిళలు విద్యావంతులై అన్ని రంగాల్లో రాణించాలనే ఆయన ప్రయత్నానికి ఫలితంగా నేడు మహిళాలు రాజకీయ, ఆర్థిక, విద్య, సామాజికి రంగాల్లో పురుషులతో సమానంగా రాణించగలుగుతున్నారని తెలిపారు. జాతీయ విద్యా విధానంలో అబ్దుల్ కలాం ఆజాద్ ఆశయాలు ఆలోచనలకు అనుగుణంగా ఉన్నాయని గుర్తు చేశారు. అబ్దుల్ కలాం పరిశోధనలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చేవారని, విద్యాశాఖ మంత్రిగా పని చేసిన కాలంలో భారత దేశంలోనే తొలి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) ఖర్గపూర్‌లో స్థాపించడం జరిగిందన్నారు. అబ్దుల్ కలాం ఆజాద్ ఏషియన్ స్టడీస్ కలకత్తాలోను, సిఎస్ఐఆర్ రీసెర్చ్ ఇనిస్ట్యూట్, సాహిత్య అకాడమీ సంగీత అకాడమీలను స్థాపించారన్నారు. యునివర్సిటీ కమీషన్ అఖిల భారత విద్య కౌన్సిల్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్ కమీషన్, సెకండరీ ఎడ్యుకేషన్ కమీషన్, ఆల్ ఇండియా టెక్నికల్ కౌన్సిల్, సెంట్రల్ సోషల్ డెవలప్మెంట్ బోర్డు, సెంట్రల్ ఎడ్యుకేషన్ బోర్డు, కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ రీసెర్చ్ వంటి అనేక సంస్థలు కమీషన్లు కౌన్సిల్స్ మౌలానా ఆజాద్ ఆధ్వర్యంలో స్థాపించబడ్డాయని గుర్తు చేశారు. విద్యారంగానికి ఆయన అందించిన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 1992లో భారతరత్న అవార్డుతో సత్కరించగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయన జయంతిని మైనార్టీ సంక్షేమ దినంగా ప్రకటించిందని తెలిపారు. తొలుత దర్గా ఇ ఇస్లామీ ఉర్దూ పాఠశాల బిషప్ అజరయ్య పాఠశాలల విద్యార్థులు అందించిన సందేశాలు, అలపించిన గేయాలు సభికులను అలరించాయి. బిషప్ రెవ. కరుణానిధి, ముస్లిమ్ మత పెద్దలను ముక్తి హబీబ్ మహమ్మద్, మౌలానా అబ్దుల్ రజాక్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్‌వో కె.మోహన్‌కుమార్, గౌడ కార్పొరేషన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌లు చైర్మన్ శివరామకృష్ణ, జమలపూర్ణమ్మ, ముస్లిమ్ మతపెద్దలు మౌలానా అబ్దుల్ రజాక్, క్రిస్టియన్ మత పెద్దలు రెవ.కరుణానిధి, మైనార్టీ సంక్షేమ అధికారులు ఎస్‌వి.నాంచారయ్య , కె.సతీష్, షరీఫ్, ఎస్.శ్యామలదేవి పాల్గొన్నారు.

అబుల్ కలామ్ చేసిన సేవలు చిరస్మరణీయం

మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో జనాబ్ భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 135వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మైనార్టీ అనే పదం కేవలం సంఖ్యను మాత్రమే సూచించటంతో పాటు ఎక్కువ మంది ప్రజలలో తక్కువ మంది ఉండటాన్ని మాత్రమే తెలియచేస్తుందని, అయితే, ప్రతిభ చూపడంలో గాని అభివృద్ధి చెందడంలో గాని అల్పసంఖ్య వర్గాలకు మైనార్టీ అనే పదం ఏ మాత్రం అడ్డంకి కాదని అందుకు తొట్ట తొలి ఉదాహరణ భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ యం.శ్యామల, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, జోనల్ కమిషనర్ డా. ఏ.రవిచంద్, మేనేజర్ బి.శ్రీనివాస్, వి.ఎం.సి.,అధికారులు మరియు సిబ్బంది పాల్గొనారు.

అబ్దుల్ కలాం ఆజాద్ 135వ జయంతి

విశాలాంధ్ర-పెడన : స్వాతంత్ర సమరయోధుడు దేశానికి ప్రథమ విద్యా శాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చరిత్రను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని పట్టణ వైఎస్ఆర్‌సిపి కౌన్సిలర్ గరికె ముక్కు చంద్రబాబు అన్నారు ఈ మేరకు మంత్రి జోగి రమేష్ ఆదేశాల అనుసారం తమ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ భారతదేశానికి మొదటి విద్యా శాఖ మంత్రి మరియు స్వాతంత్ర సమరయోధుడు అలాగే రాజ్యాంగ నిర్మాణంలో అనేక రకాల సలహాలను సూచనలను ఇచ్చిన మేధావి మన అబుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు ఆయన జయంతి రోజును ముస్లిం మైనారిటీ రోజుగా జరుపుకుంటున్నారని చాలా గొప్ప విషయం అని తెలిపారు పట్టణ కన్వీనర్ బందారు మల్లికార్జున రావు మాట్లాడుతూ మౌలానా 135వ జయంతి దినోత్సవాన్ని జాతీయ విద్యా దినోత్సవం గా ప్రతి ఒక్కరు నిర్వహించడం గర్వకారణమని చెప్పారు అన్నదానం ఆకలి తీర్చితే అక్షరధామం అజ్ఞానాన్ని తొలగిస్తుందని అందువల్లే ఆయన జయంతిని జాతీయ విద్యా దినోత్సవం గా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు అయూబ్ ఖాన్, యువజన వైఎస్ఆర్‌సిపి నాయకులు కటకం నాగ కుమార్ ,వైసిపి కౌన్సిలర్లు కోమట్ల అనిల్, బాబూలాల్, వైసిపి నాయకులు ఇమ్రాన్ , కోడూరి శ్రీనివాసరావు, పాషి, తదితరులు పాల్గొన్నారు

కూచిపూడి హైస్కూల్లో జాతీయ విద్యా దినోత్సవం

విశాలాంధ్ర-కూచిపూడి : అక్షర స్వాతంత్ర్యానికి అధికార పట్టంకట్టిన స్వతంత్ర భారత దేశ తొలి విద్యాశాఖ మాత్యులు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న' జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు'శుక్రవారం మొవ్వ మండలంలోని కూచిపూడి శ్రీ సిద్దేంద్రజిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు గుంటూరు వెంకట సత్య ప్రసాద్ మౌలానా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ విద్య వ్యక్తి ప్రగతికే కాదని మొత్తం జాతి నిర్మాణానికి పురోగతికి కూడా పునాది లాంటిదని భావించి ప్రాథమిక విద్యను ఉచిత విద్యగా చేసి ప్రతిభావి భారత పౌరుడు విద్యను అభ్యసించేలా చేసిన మహెూన్నతమైన వ్యక్తి కలాం ఆజాద్ అని పేర్కొన్నారు. ఆయన జయంతి వేడుకలను పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవం గా2008వ సంవత్సరం నుంచి కొనసాగించడం మన అదృష్టమేనని ఆయన శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పామర్తి శ్రీనివాసరావు, ఆలూరి సురేష్, టీ .దానారావు, వై.నాగలక్ష్మి, డి. సుందరమ్మ, ఏ. సుమిత, డి. లక్ష్మీ కుమారి, ఎన్. విజయలక్ష్మి, ఏ .పద్మ, వి. విజయలక్ష్మి, సిఆర్పి. తాతా సమర్పణ రావు పాల్గొని నివాళులర్పించారు.

మహనీయుడికి ఘన నివాళి

విశాలాంధ్ర-జగ్గయ్యపేట: భారతదేశ తొలి విద్య శాఖ మంత్రిగా విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసిన గొప్ప వ్యక్తి స్వాతంత్ర సమరయోధులు భారత రత్న అవార్డు గ్రహీత మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా వారిని స్మరించుకుంటూ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బొల్లా రామకృష్ణ అజాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కొమ్మినేని సత్యనారాయణ, పసుమల్ల గురువయ్య, పూనూరు గోపి, అన్నేపాగ శ్రీనివాస్ రావు, అన్నేపాగ కిషోర్, పిడమర్తి వసంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్కరణలకు ఆద్యుడు ఆజాద్

విశాలాంధ్ర-తిరువూరు: భారతదేశ విద్యా విధానంలో సంస్కరణలు ప్రవేశపెట్టిన తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం కళాశాలలో అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆజాద్ పాత్ర గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల విద్యార్థులు అధ్యాపకులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు ప్రాపంచిక దృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగదు వసూలు ఫిర్యాదులు వస్తే చర్యలు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో రోగులకు తక్షణమే వైద్య సేవలు అందించాలని, నగదు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు హెచ్చరించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం అమలుపై స్థానిక కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా స్థాయి క్రమశిక్షణా సంఘం సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో ప్రతీ పేదవానికి కార్పొరేట్ వైద్య సేవలు అందించాలని అమలు చేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా 3,255 చికిత్స, శస్త్రచికిత్సలకు ఉచితంగా వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా వర్తించే వైద్య సేవలు అందించడంలో జాప్యం లేకుండా తక్షణమే సేవలను అందించేలా ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు ప్రభుత్వంతో సహకరించాలన్నారు. చికిత్స ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చేది రానిది నిర్ధారణ చేసే సమయాన్ని జాప్యం లేకుండా వేగవంతం చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకం వర్తించే వైద్య సేవలు ఉచితమని, నిబంధనలకు విరుద్ధంగా రోగుల నుండి సొమ్ము వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత ఆసుపత్రుల ఆరోగ్యశ్రీ అనుమతులు రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఆరోగ్యమిత్రలు, నిరంతరం అప్రమత్తంగా ఉండి రోగుల అవసరాలను తీర్చాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆసుపత్రులకు చెల్లించాల్సిన సొమ్ము సకాలంలో 90 రోజుల వ్యవధిలో చెల్లించడం జరుగుతుందని, ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం ఆసుపత్రికి వచ్చిన రోగిని స్వాగతించి సహనంతో వైద్య సహాయం అందించాలని సూచించారు. సమావేశంలో ఫిర్యాదు చేసిన లబ్దిదారుల నుండి ఫోన్ ద్వారా ఆసుపత్రిలో పొందిన సేవలు, నగదు వసూలు పిర్యాదులపై కలెక్టర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో కమిటీ కన్వీనర్, జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.సుమన్, కమిటీ సభ్యులు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జి.సమరం, డియంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, ఆసుపత్రుల జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కెవి.లక్ష్మీకుమారి, ఆరోగ్యశ్రీ ఎంపానల్ ఆసుపత్రుల యాజమాన్యాలు, వివిధ ప్రైవేటు ఆసుపత్రుల ప్రతినిధులు, ఆరోగ్యశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకలను ఆకర్షించేలా మూలపాడు బటర్‌ఫ్లై పార్కు అభివృద్ధి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లో అద్భుతమైన అందాలకు నిలయమైన బటర్‌ఫ్లై పార్కు పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు సమీపంలోని కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లోని బటర్‌ఫ్లై పార్కును శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సందర్శకుల నేత్రాలకు అద్భుతమైన దృశ్య కావ్యమైన మూలపాడు బటర్‌ఫ్లై పార్కును పర్యాటకులను ఆహ్లాదరంగా అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొండపల్లి రిజర్వు ఫారెస్ట్‌లో ఎన్నో అద్భుతమైన అందాలు దాగివున్నాయని, రంగు రంగులతో కూడిన వందలాది రకాల సీతాకోక చిలుకలు ఈ ప్రాంతంలో విహరిస్తువుంటే వాటిని చూసి ఆహ్లాదించేందుకు వేయి కళ్ళు చాలవన్నారు. ఈ కొండ ప్రాంతం నుండి జాలువారే జలపాతాలు, రాతిసోయగాలు సందర్శకులను ఆకట్టుకుంటాయని, ట్రెకింగ్ చేసే యువతకు ఈ ప్రాంతం అనువుగా ఉంటుందన్నారు. కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ సహజత్వానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. దాదాపు 30 వేల ఎకరాలు విస్తీరణంలోని రిజర్వు ఫారెస్ట్‌లో జింకలు, కుందేళ్లు, నెమ్మళ్లు, దుప్పి, అడవిపందులు, కోతులు వంటి వన్య ప్రాణులతో పాటు నక్కలు, తోడేళ్ళు సంచరిస్తాయాని అటవి శాఖాధికారులు తెలిపారన్నారు. జలపాతాల వద్ద బటర్‌ఫ్లై పార్కులో సందర్శకులు సేదతీరేందుకు పగోడాల ఏర్పాటు, టాయిలెట్లు, విద్యుత్, త్రాగు నీటి సౌకర్యాం కల్పించనున్నట్లు చెప్పారు. నిత్యం వందలాది మంది సందర్శకులు కొండపల్లి ప్రాంతంలో కొండపల్లి ఖిల్లా, కొండపల్లి బొమ్మల తయారీ కేంద్రం, పవిత్ర సంగమం సందర్శించడం జరుగుతుందని, అటువంటి వారుకి బటర్‌ఫ్లై పార్కును సందర్శించేలా రవాణా సౌకర్యాన్ని కల్పించనున్నటుల తెలిపారు. బటర్‌ఫ్లై పార్కు అభివృద్ధికి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించించారు. ఈ పర్యాటనలో ఫారెస్ట్ రేజ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, డిప్యూటి ఫారెస్ట్ రేజ్ ఆఫీసర్ అనీల్‌కుమార్, ఎంపీపీ పాలడుగు జోత్స్న, ఎంపీడీవో బి.రామకృష్ణ నాయక్, తహశీల్దార్ ఎం.సూర్యారావు, అటవి శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం-ఆనందం కలయిక కార్తీక వన సమారాధన

విశాలాంధ్ర-వీరులపాడు: మండలంలో 32 వ కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని జుజ్జూరు గ్రామ ఆర్యవైశ్య సంఘం మరియు వాసవి యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అల్లూరు గ్రామ శివారులోని మామిడి తోట నందు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జుజ్జూరు,అల్లూరు గ్రామాల ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.కార్తీక మాసంలో వన భోజనాలకు ఎంతో ప్రాధాన్యం ఉందని,ఆధ్యాత్మిక చింతనతో పాటు ఆనందం,ఆరోగ్య సందేశాన్ని కార్తీక వనభోజనాలు మనకు చాటిచెబుతాయని అందుకోసమే గత 31 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ 32వ వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయాన్నే ఉసిరి చెట్టు కింద సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించి, చిన్నపిల్లలకు మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ వన సమారాధన కార్యక్రమంలో సుమారు 500 మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మిర్చి తోటల పరిశీలన

విశాలాంధ్ర-గంపలగూడెం : శుక్రవారం నాడు మండలంలోని దుంది రాలపాడు గ్రామంలోని మిర్చి పొలాలను తిరువూరు ఉద్యానవన శాఖ అధికారి ఎస్ అహ్మద్ పరిశీలించి మిర్చి రైతులకు తగు సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం మిర్చి తోటలలో వేరు కుళ్ళు ప్రధాన సమస్యగా తయారైందని, దాని నివారణపై, యాజమాన్య పద్ధతులపై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మిరపలో నల్ల తామర పురుగును గమనించడమైనదని, క్రమంగా పెరిగే అవకాశం కూడా ఉన్నదని రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మిర్చి పొలంలో నీలి రంగు జిగురు అట్టలు ఎకరానికి 30 ఏర్పాటు చేసుకొని, పురుగు ఉధృతిని గమనిస్తూ, సిఫార్సు చేసిన పురుగుమందులను మార్చి మార్చి మిరప తోట పై పిచికారి చేస్తూ, పురుగు మందులతో పాటు వేప నూనె 10,000 పి పి యం లీటరు నీటికి1 ఎం ఎల్ చొప్పున కలిపి మిర్చి పైరుపై పిచికారి చేస్తే పురుగులను అరికట్టవచ్చునని తిరువూరు ఉద్యానవన శాఖ అధికారి ఎస్ అహ్మద్ అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

కోతకు సిద్ధమైన వరి పంట

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని 18 రెవెన్యూ గ్రామాలలో, 18440 ఎకరాలలో వరి పంట వేయడం జరిగింది. ఇప్పటివరకు వరి పంటలో దోషం లేకుండా మంచి దిగుబడి వచ్చే విధంగా వాతావరణం అనుకూలంగా ఉండటంతో గ్రామీణ ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కోతకు పనివారు కావలసి ఉన్నందున అందుకు వాతావరణం కూడా ఇకముందు తుఫాను, గాలి వాన, రాకుండా ఉంటే రైతు కష్టానికి తగిన ప్రతిఫలం అందుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

60 మందికి కంటి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : మండలంలోని వెలగలగూడెం చర్చి నందు శుక్రవారం అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో ఉచితి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అభ్యుదయ యువశక్తి సంఘం అధ్యక్షులు చింతిరాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ శిబిరం నందు 60 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 20 మందికి కంటి శుక్లములు, పొరలు ఉన్నట్లు గుర్తించిచడం జరిగిందన్నారు. వీరిని విజయవాడలోని చైతన్య కంటి అసుపత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు చింతిరాల ఫ్లొరెన్స్, సంఘం సభ్యులు నమ్మిక శివనాగులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు ఏర్పాట్లు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలోని ప్రభుత్వాసుపత్రి రహదారి విస్తరణకు అధికారులు రంగం సిద్ధం చేశారు. సర్వే సిబ్బంది రహదారిలోని పట్టాదారులకు నోటీసులు జారీ చేసి, శుక్రవారం కొలతలు ఆరంభించారు. ఆక్రమణల తొలగింపుకు సంబంధించిన మార్కింగ్ ఏర్పాటు చేయకుండా వెళ్లిపోవటంతో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ విషయమై మండల సర్వేయర్ ప్రసాద్‌ను విచారించగా, తహశీల్దారు కె.లక్ష్మి అందుబాటులో లేనందున మార్కింగ్ ప్రక్రియ ఆగిందని, త్వరలో చేపట్టనున్నామని వివరించారు.

త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు : ఏడీఏ జీ కెనడి

విశాలాంధ్ర-తిరువూరు: తిరువూరు డివిజన్ లో వరి కోతలు మొదలైనందున త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఏడీఏ జీ కెనడి తెలిపారు. స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. పీఎం కిసాన్ కౌలు రైతు భరోసా ఆగస్ట్19వ తేదీ తర్వాత తీసుకున్న సీసీఆర్సీ కార్డులు, ఓనర్ రైతు భరోసా గ్రీవెన్స్ లో కొత్తగా వచ్చిన పాస్ పుస్తకాలు నమోదు చేసుకొనుటకు ఈనెల 30 వరకు గడువు పొడిగించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి పీ పద్మ, మండల స్థాయి సలహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.